"**అమ్మా,** శారదా! నీ కోసం అబ్బాయి వచ్చాడు."

చప్పున వెనక్కి తిరిగి చూసింది. ఆ మాట చెప్పేసి డాక్టరు గారు తిరిగి వెళ్ళి పోతున్నారు.

పొంగబోతున్న పాలపై చన్నీళ్ళు చిలకరించి గిన్నెను దింపి, మరో గిన్నెలో కాఫీకి నీళ్ళు పోసి స్టౌ మీద పెట్టి ఆదరా బాదరా తడి చేతులు కొంగుకు తుడుచుకుంటూ వంటింట్లోంచి ఇవతలికి వచ్చింది శారద.

తల వంచుకుని ఏదో పుస్తకం తిరగేస్తూ హాలులోని సోఫాలో కూర్చుని ఉన్న కొడుకుని చూడగానే ఆమె కళ్ళు మెరిశాయి.

ఆ మెరుపుల తాలూకు వెలుగులు సోకినట్టయి ముఖం పైకెత్తిన అతడి కళ్ళలోకి ఆ కాంతి ప్రసరించింది.

"బాచీ..." ఆనందం కలిగించిన ఉద్వేగంతో ఉక్కిరి బిక్కిరయింది శారద.

"అమ్మా..."

చేతుల్లోని పుస్తకం టీపాయ్ మీద పడేసి లేచి దగ్గరగా వచ్చాడు.

"బాగున్నావా, నాయనా!" తనంత ఎత్తుకి ఎదిగిన కొడుకుని కళ్ళ నిండుగా చూసుకుంటూ అడిగింది. ఆ తల్లి కళ్ళలో ఉబుకుతున్న తడి.

పసితనం వదలని బేలతనం ఆవడానికి అశక్తతను వెలిబుచ్చడంతో ఉబికి, పొంగి ప్రవహిస్తున్న తడి బాచి కళ్ళలో.

ఆ తడిని తుడుచుకోవాలని, రెప్పల వెనుకే బంధించాలని వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాయి అతడి పెరిగిన వయసు, ఎదిగిన మనసు. మాట వెలువడని ఆ స్థితిలో తల ఊపాడు బాగున్నానన్నట్టుగా.

"తమ్ముడు...?" గుండె చిక్కబట్టినట్టయింది శారదకు.

ఆమె కళ్ళ ముందు బొంగరాలు ఆడుతూ, చీటికీ మాటికీ నుదుటి మీద పడే ఉంగరాల జుత్తుని వెనక్కి పడేట్టు తల విసురుతూ, చురుగ్గా, తెలివిగా మెరిసే కళ్ళతో, కోటేరు లాంటి ముక్కుతో, పచ్చగా, బొద్దుగా, నిండైన పాలబుగ్గలతో బొమ్మలా ఉండే 'చిన్నా' మెదిలి... కదిలి... నవ్వుతున్నట్లయి, ఆడుతున్నట్లు కనిపించి, హఠాత్తుగా 'అమ్మా' అని దీనంగా పిలుస్తూ తన వైపు చేతులు చాపిన ట్లనిపించింది.

అప్పటి దాకా లీలగా కదులుతున్న తడి ఈ ఆలోచనతో వాగై... వంకై... ఏరై జలపాతంలా దుమికింది శారద కళ్ళలోంచి.

చేతులు చాచి దగ్గరకు తీసుకుని హృదయానికి అదుముకున్న ఆమె గుండెలోని వేదన వెల్లువలా పొంగి కొడుకు తలని, వీపుని చిత్తడి చిత్తడి చేసింది.

శారద గుండెని వేదన దహిస్తున్నా, ఆ గుండెలో తల దాచుకున్న బాచికి మాత్రం ఆ స్పర్శ ఆప్యాయంగా, అమృతపు జల్లులా సోకి స్వాంతన కలిగిస్తోంది.

అనిర్వచనీయమైన అనుభూతిలోంచి, మూగపోయిన ఆ స్థితిలోంచి బయటపడి తెప్పరిల్లటానికి చాలా సేపు పట్టింది ఇద్దరికీ.

వంటింట్లో చప్పుడయినట్టు అనిపించి అప్పుడే స్ఫురణకు వచ్చిన దానిలా పెదవి కొరుక్కుని లోపలకు వెళ్ళటానికి ఉద్యుక్తురాలయి- "కూర్చో, నాన్నా... ఇప్పుడే వస్తాను" అంది.

వంటింటి గడప దాటి లోపలికి అడుగేసిన శారదకు కాఫీ కలుపుతున్న డాక్టరు గారు కనిపించారు.

"బాబాయ్..." నొచ్చుకుంటున్నట్టుగా ఆ పని తన చేతుల్లోకి తీసుకుంది.

"ఫరవాలేదులే. నీళ్ళు మరుగుతూ ఇగురుతున్నట్టుంటే..."

"నా మనసు లాగా మరిగి... నా బ్రతుకులా ఇగిరి... కదూ, బాబాయ్?"

కంఠంలో దుఃఖం ఘనీభవిస్తూ స్వరం పూడుకుపోతోంది.

"చూడు, శారదా! ఇలా ప్రతి చిన్న విషయమూ నీ జీవితంలోని చేదు అనుభవాలకు పోల్చుకోవడం ముందుగా మానేయాలి నీవు. బేలతనం పోగొట్టుకుని మనఃస్థయిర్యం పొందగలగాలి. అంతేగాని నువ్వేడ్చి, ఆ పసి వాడిని ఏడిపిస్తూ... ఇదేమన్నా బాగుందా? సరి సరి, ఆ కాఫీ ఇచ్చి,

అంచెలంచెలుగా వృద్ధిలోకి రావాలి. గొప్పవాడివి కావాలి... చిన్నాకీ ఈ మాటే చెప్పు."

కంఠ స్వరం రుద్ధమై జీర పోయింది శారదకు.

తిరిగి ఎప్పుడు చూస్తానో అన్న తపన చూపుల్లో తారట్లాడుతోంటే, తల్లి నడుము చుట్టూ ఒక చేయి బిగించి, మరో చేత్తో భుజాన బాగు సర్దుకుంటూ ఒక్కో అడుగే ముందుకు వేస్తున్న బాచి పెదవుల మీద ఎన్నెన్నో మాటలు అమ్మకు చెప్పాలని.

'నేను బాగా చదువుకుంటాను. నువ్వేం దిగులు పెట్టుకోకు. ఎంతగా చిక్కిపోయావో తెలుసా, అమ్మా ?ఇలా కృశించిపోకు... నువ్వు బాగుండాలి... నువ్వింకా ఎన్నాళ్ళో మాకు కావాలి.' ఇలా మూగ మనసులోంచి ఒక్క మాటా పెదవి దాటి రాలేకపోయాయి. పెదవి విప్పితే మాట కన్న ముందు ఏడుపు వస్తుందేమో అన్న భయం.

గుమ్మం దాటి బయటికి రాగానే చటుక్కున వంగి తల్లి పాదాలు కళ్ళకు అద్దుకున్నాడు.

ఏమని ఆశీర్వదించిందో వినబడలేదు కాని,



పెద్దకథ

# అంతర్వాహిని

**తెనాలి సుశీలాదేవి**

అబ్బాయికి ఇష్టమైన దేదో వండి త్వరగా భోజనం పెట్టు." చనువుగా మందలిస్తూ చెమర్చిన తన కళ్ళను కళ్ళజోడుతో కప్పుకుంటూ బాచి దగ్గరకు వచ్చి మాటలు కలిపారు ఆయన.

కాలేజీలో డిగ్రీ కోర్సులో చేరబోతూ తల్లిని చూడాలని, ఆశీస్సు లందుకోవాలని ఆరాటంగా వచ్చాడు బాచి.

కంచం నిండా తన కిష్టమైన పదార్థాలే ఉన్నా తల వంచుకుని వ్రేళ్ళతో కెలుకుతున్న కొడుకుని చూసి ప్రక్కనే కూచుంది శారద.

"నేను కలిపి పెట్టనా,బాచీ?" కంచంలో చేయి పెట్టింది.

అప్పటి దాకా రెప్పల మాటున తారట్లాడుతున్న నీటి చుక్కలు టప్పుమని ఆ చేయి మీద పడ్డాయి అతడు అంగీకారంగా తల తిప్పడంతో.

అన్నం, కూర కలిపింది శారద.

బాచి తల్లి చేయి పట్టుకున్నాడు. ఆ అరచేతిలో తన చేత్తో ఒక ముద్ద పెట్టాడు. అమ్మ చేతిని తన నోటి దగ్గరగా ుకున్నాడు.

బాధ... సంతోషం... ఏడుపు... నవ్వు ... అన్నీ కలిసిపోయి... కలగా పులగమయి గుండెల్నిండా నిండిపోతే ఏం తిన్నారో తెలీకుండానే వాళ్ళ కడుపులూ నిండి పోయాయి.

"శ్రమించి శ్రద్ధగా చదువుకో, నాన్నా, బాచీ... ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో. బాగా చదువుకుని ...

తల్లి కళ్ళ నుండి జారిన బాష్పాలు తన తల మీద రాలి తడపటం తెలిసింది. ఆ బిందువుల్లోనే ఎన్నెన్నో ఆశీస్సు లుంటాయని బాచికి తెలుసు.

చిత్తడి కళ్ళతో ఒకసారి తల్లిని నిండుగా చూసుకుని నోటితో వీడ్కోలు పలకలేని అశక్తతతో చేయి నొక్కి నాలుగడుగులు రోడ్డు మీదకు నడిచి వెనక్కి తిరిగితే అడుగు ముందుకు సాగదేమో అన్న భయం. తిరిగి చూడాలనిపించిన కోరికని అణిచేస్తే, తల వంచేసుకుని చరచరా నడిచాడు.

వెళ్ళిపోతున్న కొడుకుని కన్నీటి తెరల్ని చీల్చుకుంటూ పట్టి పట్టి చూస్తూ ఆ రూపం వీధి మలుపు తిరిగి మరుగై పోయే వరకు గుమ్మం పట్టుకుని నిలబడి పోయింది శారద.

కొంచెం సేపే అయినా, అంత బాధలోనూ వాడి రాక కలిగించిన సంతోషం వాడితోనే నడిచి పోయింది.

వాడిని చూడటంతో వెలుగు నింపుకున్న తన కళ్ళ కాంతి వాడితోనే మరుగై పోయింది.

వాడి సమక్షంలో తనలో వచ్చిన చైతన్యం వాడి వెనకాలే తరలి పోయింది.

మళ్ళీ ఏముంది?... మామూ లే... మోడువారిన బ్రతుకు... బీడు బారిన గుండె. వీటినిండా నెర్రెలు... పగుళ్ళు.

గుండెను చీల్చుకుంటూ రాబోయిన నిట్టూర్పుని పెదిమలు బిగించి లోపలికే అణిచివే



సింది.

అశాంతి, కలత, ఆవేదన ఆ రాత్రి శారదకు నిద్రను దూరం చేశాయి. తన ప్రమేయం లేకుండానే ముసురుకుంటున్న ఆలోచనల తీవ్రతకి లోబడి పోయింది.

కాల ప్రవాహంలో తన కళ్ళ ముందు కదిలిపోయిన గత స్మృతుల వలయంలో చిక్కుకుపోయింది.

శారద మనోనేత్రం ముందు వెలుగు నీడలు... సుఖ దుఃఖాలు పరిభ్రమిస్తున్నాయి.

*** ***

బాణం దెబ్బ తిని కూలిపోయిన పిట్టలా విలవిలలాడుతున్నది శారద హృదయం. తను విన్నది నిజమా?

లేదు... లేదు... వీల్లేదు... అలా జరగటానికి తను అంగీకరించలేదు. అంగీకరించదు కూడా ముమ్మాటికీ...

గుండెలో ఇమడలేని భావాలు బాధాపూరిత కంఠంలోంచి వెలువడి ఏడుపుగా మారి ... ఆ తీవ్రత ఘనీభవించి... కరుడుగట్టుకు పోయి ... మొండి ధైర్యంగా నిలిచిపోయింది.

**** ***

బస్సు ఆ ఇద్దరినీ రోడ్డో దింపేసి దుమ్ము రేపుకుంటూ వెళ్ళి పోయింది.

అలసట శరీరాన్ని వడలిపోయేట్లు చేస్తే, అంతరాంతరాలలోని ఆవేదన ముఖాలని వాడి పోయేలా చేసింది.

రోడ్డు నుంచి ప్రక్కకు దిగి, మట్టి బాట వెంట అడుగులు ముందుకు వేశారు. ఏ ధైర్యంతో తను పిచ్చిదానిలా ఇలా మట్టి కొట్టుకు పోతూ సాగుతోంది? చల్లగా నీడ పట్టున ఉన్న తనను ఈ మండు టెండలోకి విసరి వేస్తున్న శక్తి ఏమిటి?

ఒక్కో ఆలోచన శక్తి హీనురాలిగా చేస్తోంటే, బలవంతంగా కాళ్ళను కూడదీసుకుని అడుగులు వేస్తోంది.

"వీరన్నా... ఇప్పటికే సమయం మించి పోయిందేమో?"

ఊహే భయంకరంగా సాగి శారద కంఠాన్ని నొక్కి పెడుతోంది.

"మీరు గుండె గట్టి చేసుకోవాలి, తల్లీ. నిబ్బరం తెచ్చుకోవాలమ్మా." అంతకన్న మరేం మాట్లాడలేక పోయాడు వీరన్న.

మౌనంగా నడక సాగదీశారు.

సమస్య వివిధ రూపాలుగా కళ్ళ ముందు కదులుతూ గుండెని కలవర పెడుతోంది. భవిష్యత్తు అయోమయంగా తోస్తూ భయపెడుతోంది.

'ఇప్పటికే మించిపోయి ఉంటే తనేం చేయాలి?నిలువెల్లా వణకి పోయింది శారద.

ముందసలు తను నమ్మలేక పోయింది.

ఇట్లా జరుగుతుందని గానీ, ఇలాంటి భయంకర సమస్య తన జీవితంలో తొంగి చూస్తుందని గానీ కలలో నైనా ( నుకోలేదు.

మంచు తెరలా విడిపోతోందో... కారుమబ్బులా కబళిస్తుందో ... అస్పష్టమైన భయం నిలువెల్లా ఆక్రమించుకొంది.

నిన్నటికి నిన్న... ఈవేళప్పటి వరకు తనెంత నిశ్చింతగా ఉంది? రేఖా మాత్రంగా కూడా ఈ భయాందోళనలు తనను స్పర్శించనయినా లేదే!

పిల్లలు అన్నాలు తినేసి స్కూలుకు వెళ్ళిపోయారు.

'ఈ రోజయినా రాకపోతారా... ఇంకా సేపు వేచి చూద్దాం' అనుకుని భోజన కార్యక్రమాన్ని కా సేపు వాయిదా వేసి గలీబు కవరు మీది జంట చిలుకలను పూర్తి చేయటానికి సూది, రంగు దారాలు ముందు పెట్టుకుని కూర్చుంది.

వారం రోజుల కాంపు మీదవెళ్ళిన భర్త రాక కోసం రెండు రోజులుగా ఎదురు చూస్తోంది శారద. వస్తానన్న రోజుకి రాకపోతే ముందుగా తనకు ముంచుకొచ్చేది కోపం. ఆపై కాల వ్యవధి పెరిగిన కొద్దీ కోపం కరిగిపోయి భయమూ, ఆందోళనా... ఎక్కడున్నారో... ఎట్లా ఉన్నారో... ఏం జరగలేదు కదా... ఆలస్యమైతే అయింది క్షేమంగా వస్తే చాలును... పేరు పేరునా ప్రతి దేవుడికీ విన్నపాలు. ఈ ఆలోచనలతో చిలుక ముక్కు కుట్టటం తప్పు పోయింది.

ఆ తప్పుని విప్పే ప్రయత్నంలో ఉండగా... వీరన్న ఒక్కడే రావడం చూసి ఆశ్చర్యపోయింది శారద. పైగా ఒట్టి చేతులతో వచ్చాడు. తన భర్తతో కూడా కాంపుకి వెళ్ళే బంట్రోతు వీరన్న. అతడి చేతుల్లో భర్త తాలూకు సామాన్లేవీ లేవు.

"ఏమిటి, వీరన్నా ... నువ్వు మాత్రం వచ్చేశావా... మరి మీ అయ్యగారేరీ?"

వీరన్న ఏదో చెప్పబోయి మానేసి తల వంచుకున్నాడు. చేతులు నులుముకుంటున్నాడు.

అతడి వైఖరి ఆశ్చర్యం కలిగించలేదు తనకు. ఇది మామూ లే.

ఏదో, ఎక్కడో పొరపాటు చేసి ఉంటాడు. అయ్య గారి ఆగ్రహానికి గురయి ఉంటాడు. తను సర్ది చెప్పి కోపం పోగొట్టాలి. ముసలి వీరన్నను చూ స్తే జాలి తనకి.

"సరే,అయ్యగా రొచ్చాక కనుక్కుంటానులే" అంది ముడిలో చిక్కుకున్న దారాన్ని సూది మొనతో పైకి లాగుతూ.

"అమ్మా!" దీనంగా అన్నాడు వీరయ్య.

'ఏమిటి' అన్నట్లు తలెత్తి చూసింది. గట్టిగా లాగడంతో దారం తెగిపోయింది.

తన ముఖంలోకే చూస్తున్న వీరన్నను చూసి ... అతడి కళ్ళలో కదులుతున్న నీటి తెరలని... వణకే అతడి పెదవుల మీద ఏదో చెప్పాలన్న ఆత్రతను గమనించి ... ఆశ్చర్యపోయి... మరు క్షణం తనలో తనే నవ్వుకుంది.

'ఈ సా రేదో క్షమించలేని అపరాధమే చేసి ఉన్నట్టున్నాడు, పాపం!' అనుకుంది.

"అయ్య గారితో నేను సర్ది చెబుతానన్నానుగా... ఇంతకీ మీ అయ్యగారు ఎప్పుడు వస్తారట?" ఆప్యాయంగా అడిగింది.

వీరన్న పెదవులు విప్పాడు. ఆ పెదవులు దాటి వచ్చిన ఒక్కో మాటా తనను దిగ్బంధనం చేసింది.

కొన్ని క్షణాల వరకు అత డేం చెబుతున్నాడో అర్థం కాలేదు.

అయోమయంలోంచి బయటపడి అర్థం చేసుకుని మనసుకు పట్టించుకొనేసరికి పాదాల క్రింద భూమి కదిలి పోతున్నట్టు తోచింది.

తల మీద నిప్పుల వర్షం కురుస్తున్నట్టయి... ఆ సెగలు ఒళ్ళంతా ప్రాకి గుండెలోకి దూరి... అక్కడ మరింతగా రగిలి ... ఆ గుండె పగిలి పోతుందేమో అన్న స్థితికి వచ్చేసరికి అలాగే కుప్పలా కూలిపోయింది తను.

*** ***

కాలికి రాయి కొట్టుకుంది. జివ్వు మంది ప్రాణం.

ఆలోచనల దారం పుటుక్కున తెగిపోయింది.

వంగి చూసుకుంది. బొటనవ్రేలు రక్తం చిమ్ముతోంది. మట్టి తీసుకుని అద్దింది. తలెత్తి ముందుకు చూసింది. అయిదారు అడుగులు ముందరగా సా[illegible]కున్నాడు వీరన్న. కొద్దిగా వంగి నడుస్తున్నాడు. తన కోసం వచ్చాడు తనకు దారి చూపటానికి... తనకు తోడుగా కూడా. ఎండను పడి చెమట కక్కుతూ... ముసలి ప్రాణం...

తను...? తనెందుకు వస్తోంది? తనేం చేయాలనుకుని ఉన్నపళంగా పరుగెట్టుకుని... కాపురం కాపాడుకోవాలని... తన బ్రతుకును ముక్కలుగా చేసే అన్యాయాన్ని ఎదుర్కోవాలని... తన హక్కులు నిలబెట్టుకోవాలని... ఇది సాధ్యమయ్యే పనేనా తనకు? ఏమో... తన ముఖం చూసయినా చివరి క్షణంలో నిర్ణయాలు సడలి... ఏ మూ లో రవంత ఆశ !

తనెదుర్కోబోయే సన్నివేశం ఎలా ఉంటుందో! తనెప్పుడూ పది మందిలోకి వచ్చిన అలవాటు లేదు.

భర్త... పిల్లలు... సంసారం... ఇదే తన పరిధి... ఇదే ప్రపంచం తనకి. అలాంటి తను ... ఇప్పుడు ... ఈ రోడ్డు వెంట... పిచ్చి దానిలా... తగిలిన వ్రేలుకే మళ్ళీ కొట్టుకుంది రాయి. ఈమారు బొట బొటా కారింది రక్తం. అక్కడి మట్టి కొద్దిగా తడిసి ఎర్రగా అయింది. ఈసారి మట్టి అద్దలేదు శారద.

ఆలోచిస్తోంది. 'గుండెకు తగిలే దెబ్బ కూడా ఇలాగే రక్తాన్ని ఒడుస్తుందా?...' శారద మళ్ళీ కొన్ని క్షణాలు ఆగడంతో మరింత ముందుకు వెళ్ళాడు వీరన్న.

మట్టి బాట వెంట ఎవరో ఎదురయారు.

ఎదురయిన బాటసారులను ఆపి ఏదో అడుగుతున్నట్లుంది వీరన్న. వెనక్కి తిరిగి చూసి ఆగి నిలబడ్డాడు వీరన్న.

శారద త్వర త్వరగా అడుగులు ముందుకు వేసింది.

ఎదురైన మనుషులు శారదను చిత్రంగా చూస్తూ దాటి పోయారు.

రేగి పోయిన జుట్టు... పీక్కుపోయి లంఖణాలు చేసినట్టున్న ముఖం ... చెమటకు తడిసి, దుమ్ము కొట్టుకుపోయి మాసిపోయిన సాదా వాయిల్ చీర, అలసట వల్ల వస్తున్న వగర్పు.

'దగ్గరగా వచ్చినా కదలడేం వీరన్న... పాపం ... బాగా అలిసి పోయాడు గావును' అనుకుంటూనే సమీపించి... 'నడు' అనబోయి... ఆ ముఖంలోకి చూసి తెలియని భయంతో వణకి పోయింది శారద.

జాలిగా... వేదనగా... ఎందు కలా చూస్తున్నాడు? ఆ కళ్ళెందుకు... ఎందుకని అలా... నిండిన చెరువులా కనిపిస్తున్నాయి?

"నిలబడ్డావేం, వీరన్నా? త్వరగా పోదాం పద."

"పదండమ్మ గారూ." రుద్ధ కంఠంతో అన్నాడు.

అడుగు ముందుకు వేసింది శారద వీరన్నను దాటి.

"అటు కాదమ్మా... ఇటు వెనక్కి నడవండి." అతిప్రయత్నం మీద గొంతు పెగలచు కుని చెప్పలేక చెబుతున్నట్టుగా అన్నాడు.

"వీరన్నా! ఏమిటిది... వెనక్కు..." సరసర మంటూ వెన్ను పొడవునా భయం శారదను అదరగొట్టింది.


"ముందుకు వెళ్ళే అవసరం ఇంక లేదు, తల్లీ... ఆపాలనుకుంది జరిగిపోయింది... అయ్యగారు ఆ అమ్మాయిగారితో కలిసి జీపులో వస్తున్నారంట."

నిండిన చెరువుకు గండి పడింది.

కళ్ళు తుడుచుకోబోయి... నీటి తెరల మధ్య చూసి... నేల మీదికి జారి పోతున్న అమ్మ గారిని చేతుల్లోకి పట్టుకుని పక్కనున్న చెట్టు కిందికి చేర్చి... పై పంచెతో విసరసాగేడు వీరన్న.

క్షణాల మీద అచేతన స్థితిలోకి జారిపోయిన శారద స్పృహలోకి రావటానికి చాలా క్షణాలు పట్టింది.

తనను తను అర్థం చేసుకోటానికి, తను ఉన్న స్థితి గుర్తు రావటానికి ఆమెకి ఎంతో సేపు పట్టలేదు.



గుర్తు వచ్చాక పిచ్చి దానిలా చూసింది వీరన్న వైపు.

తను విన్నది కలలో కాదు... తను భ్రాంతిలోనూ లేదు. ఇది వాస్తవం, నిజం, చేదు నిజం.

ఈ నిజం గరళంలా తన నరనరాల్లో ప్రాకి... ఒంట్లోని రక్తాన్ని నీరుగా మార్చి... తన శక్తిని ఆవిరి చేస్తూ... శారద గుండె కరిగి... మ...రి...గి... లావాలా పొంగి... ఆ తరువాత చల్లబడి శిలగా మారటానికి ఎంత సేపో పట్టలేదు.

వీరన్న ముందుగా చెప్పి ఉండకపోతే, తను ప్రతి క్షణం ఎదురు చూస్తున్న భర్త పెళ్ళికొడుకుగా గుమ్మంలోకి ఎదురు వచ్చి నిలబడి ఉంటే, వరాయి వ్యక్తి ద్వారా వార్తలా విన్న విషయానికే కుప్ప కూలిపోయిన తను, ఆ దృశ్యం ఎదురై, హఠాత్తుగా అసలు మనిషే కళ్ళబడి ఉంటే, ఆ క్షణానే గుండె వగిలి చచ్చి ఉండేదా?

అలా జరిగి ఉండినా బాగుండును. దహిస్తున్న ఈ దావానలం వంటి బాధ క్షణాల్లో తప్పి ఉండేది.

ఇప్పుడైనా తన ప్రాణం పోలే దెందుకనో?

గుండె ఇంతగా రగిలిపోతూందే... అదెందుకని పగిలిపోవడం లేదు? కన్నీళ్ళ వల్లనా? ఈ కన్నీళ్ళకా శక్తి ఉందా?ఎన్ని యమునలు... ఎన్ని గోదావరులు ఈ కళ్ళంట పొంగితే మాత్రం ఈ మంట చల్లారుతుంది?

వస్తుం దొస్తుం దనుకున్న ప్రమాదం... క్షణ క్షణం భయపెట్టే ప్రమాదం వచ్చి మీద పడేనరికి గుండెదిటవు, మొండిధైర్యం వాటంత టవే వస్తాయేమో...

చివ్వున పైకి లేచి నిలబడింది. తనను తాను నంబాళించుకుంది.

"వీరన్నా! మనం కా సేపు ఇక్కడే నిలబడదాం."

ఆశ్చర్యంగా, అయోమయంగా చూశాడు వీరన్న.

"వద్దమ్మా! మనం త్వరగా తిరిగి వెళ్ళిపోదాం-వదండి." అనునయంగా అన్నాడు.

"ఎందుకని?"

"ఇంకా సేవట్లో... అయ్య గారి జీపు... ఈదారంటే..." ఆగి ఆగి చెప్పాడు.

"అందుకే... కా సేపు ఆగుదామంటున్నాను." నిబ్బరంగా అంది శారద.

*** ***

దూరంగా జీపు వస్తున్న నవ్వడి.

నిటారుగా అయింది శారద.

వీరన్న ఆత్రతతోనూ, ఆందోళనగానూ చూస్తున్నాడు ఆమెని.

ఆత్మీయుల్ని అప్పుడే దహనం చేసి వచ్చిన వారిలా ఉంది శారద ముఖం.

మంకెన పువ్వుల్లా మారిన ఆ కళ్ళలో మాత్రమే జీవ మున్నట్టుంది.

దుమ్ము రేపుకుంటూ వచ్చిన జీపు కీచుమంటూ ఆగిపోయింది.

ఎదురుగా కనవడ్డ వాళ్ళని చూసి ఖంగు తిన్నాడు నత్యం.

ఊహించని నంఘటన... ఎదురు చూడని కలయిక...

ఈ ఇబ్బందికరమైన నన్నివేశం తను ఎదుర్కోవలసి వస్తుందని అనుకుంటూనే ఉన్నాడు గానీ, ఆ నమయం ఇంత త్వరగానూ... ఇలా హఠాత్తుగానూ... ఈ విధంగా దారిలోనే ఎదురవుతుందని అనుకోలేదు.

ఇదెట్లా జరిగింది?

వీరన్న కేసి చూశాడు నత్యం. అర్థమైంది.

లిప్త మాత్రం ఆ చూపులతో చూపు కలిపి చేతులు కట్టుకుని తల వంచుకున్నాడు వీరన్న.

భర్త ప్రక్కనే కూర్చుని ఉంది. ఎదురైన హఠాత్సంఘటనకు నిరుత్తరు రాలైనట్టు చూస్తున్న ఆ అమ్మాయి కేసి క్షణంలో నగం సేపు చూసి, దృష్టి మరల్చుకుని... వదిహేనేళ్ళ క్రితం పెళ్ళికొడుకుగా ప్రక్కన కూర్చుని... మెరిసే మాంగల్యాన్ని మెడలో వేసి, మూ డుముళ్ళ బంధంతో భర్తగా మారి... తన చేయి పట్టుకుని ఏడడుగులు నడిచి... నహచరుడై... తన వయసును, వలపును పండించి, నర్వస్వానికి హక్కుదారుడై, జీవితాంతం తోడుగా... తనకూ, పిల్లలకూ నీడగా ఉండాల్సిన వ్యక్తి ఇప్పుడు- ఇన్నేళ్ళ తరువాత మళ్ళీ పెళ్ళికొడుకు అవతార మెత్తి, మరో ఆడదాని ప్రక్కన నిలబడి ఎదుట బడిన భర్తకేసి సూటిగా చూసింది శారద.

ఆ ఒక్క చూపులోనే ఆవేదన... గుండెను పిండుతున్న బాధ... నింద... నిష్ఠురం... నిరసన... ఛీత్కారం... కలగా పులగమై- తనను కాల్చేస్తున్నట్టున్న ఆ చూపుని భరించలేక పోయాడు.

"శారదా" రెండడుగులు ముందుకు వేశాడు.

"ఆగండి." నెమ్మదిగా అన్నా దృఢంగా అంది.

చప్పున నిలిచిపోయాడు నత్యం మంత్ర ముగ్ధుడిలా.

వీరన్న ఆందోళనగా చూస్తున్నాడు. ఏదో నర్ది చెప్పటానికి చూశాడు. కాని,ఇప్పటి అమ్మ గారిని చూస్తుంటే భయంగా ఉంది.

"వదిహేనేళ్ళ వయస్సులో మీ చేయి పట్టుకుని నా వాళ్ళందరినీ విడిచి మీ కూడా వచ్చాను. వదిహేనేళ్ళు మీతో కాపురం చేశాను. ఇద్దరు పిల్లలకు తల్లినయ్యాను. ఇన్నాళ్ళలోనూ... ఇప్పటికీ కూడా మీరు క్యాంపుకంటూ బయటకు వెడితే మీరు తిరిగి వస్తానని చెప్పిన రోజు కోసం రోజులు లెక్క పెట్టుకుంటూ... అవి ఒక్క రోజు గడువులోకి వచ్చేనరికి గంటలు చూసుకుంటూ ... క్షణం క్షణం మీ రాక కోసం ... మీ పాదాల నంటి ఉన్న ఆ బూట్ల చప్పుడు కోసం... మీ పిలుపు కోసం నిరీక్షిస్తుండేదాన్ని. గడువు మీరిపోయి ఏమాత్రం ఆలస్యమైనా పరిపరి విధాలుగా వరుగెత్తే మనసును అదుపులో పెట్టుకోటానికి ప్రయత్నిస్తూ... మధ్య మధ్య వేయి దేముళ్ళకి మొక్కుకుంటూ... మీరు కనవడగానే చప్పున తుడిచిపెట్టుకుపోయిన ఆ ఆందోళనని, అప్పటిదాకా పడిన ఆత్రతని మరిచిపోయి మీకు ఎదురు వచ్చేదాన్ని. కాని... కాని... ఈనాడు... మిమ్మల్ని ఇలా చూసిన తరువాత... మీ రాకని మధ్యంతరంగా ఇలా ఎదుర్కోవలసి వచ్చిన తరవాతఏమనిపిస్తూందో చెప్పనా?" ఆవేశం పెంచుతున్న ఆయాసాన్ని రెండు క్షణాలు అదిమి పట్టింది.

"మీ రిలా రావడం కన్నా ఇదే జీపులో మీ శవం వచ్చి ఉంటే కూడా ఇంత చిత్రవధ ననుభవించి ఉండను." పెదిమలు బిగించి దోసిట్లో ముఖం దాచుకుంది శారద. ఏడుపు రావటం లేదు. కాని. విషాదాన్ని దాచుకోవాలని యత్నం.

గాలి కూడా స్తంభించి పోయిం దా క్షణంలో అక్కడ.

నిశ్చేష్టులై నిలబడి పోయారు శ్రోతలందరూ.

శారద చివరిగా విసిరిన బాణం నత్యానికి ఎంత సూటిగా తగిలిందో ఎవరికీ తెలియలేదు గానీ... ముక్కలయిన ఆమె హృదయం... తెంచుకుంటున్న అనుబంధం స్పష్టంగా కనవడినట్లయింది.

"అమ్మ గారూ..." బెరుకుగా పిలిచాడు వీరన్న.

"వీరన్నా... రా పోదాం." మాటతో పాటే చివ్వున వెనక్కి తిరిగింది.

ఇంకొక్క క్షణమైనా నిలబడలేనట్టు చరచర అడుగులు వేసింది.


"శారదా!" పిలవబోయిన పిలుపు ధైర్యంగా బయటికి రాలేక నత్యం కంఠంలోనే అణగారి పోయింది.

వీరన్న అయ్యగారి కేసి ఒకసారి చూసి... తల వంచుకుని మారు మాటాడకుండా శారద వెనకే అడుగులు వేశాడు.

అప్రతిభురాలై, చిత్తరువులా నిలబడి, కేవలం ప్రేక్షకురాలిగానే ఉండి పోయిన పెళ్ళికూతురి కళ్ళ కాటుక చెదిరింది తడి తగిలి. తనని ఒక్క మాటయినా నిందించని శారద నంస్కారం అంచనా వేసుకుంటోంది.

"మనం ముందుగా గెస్ట్ హౌస్‌కి వెడదాం." అవరాధిలా అన్నాడు నత్యం.

ఊగీ ఊగకుండా తల ఆడించింది ఆ పెళ్ళి కూతురు. (నశేషం)



పెద్దకథ

# అంతర్వాహిని

తెనాలి సుశీలాదేవి

(క్రిందటి సంచిక తరువాయి)

**రెక్కలు** వచ్చి, ఎగరటానికి అప్పుడే శక్తి వచ్చిన పిట్ట అనంతాకాశంలో ఎంత సంతోషంగా, ఉల్లాసంగా గిరికీలు కొడుతూ ఉంటుందో!

ఆడుతూ, పాడుతూ ఆనంద లహరిలో మైమరిచి పోయే వ్యక్తి ఊహాలు ఎంత సుందరంగా ఉంటాయో!

పిట్టయినా, మనిషయినా- ఏ ప్రాణీనయినా అడకత్తెరలో పెట్టి నొక్కటానికి విధికి అర నిమిషం చాలు.

కాని,, అందులోంచి బయట పడటానికి కొంత కాలం పడుతుంది. ఒక్కోసారి జీవిత కాలం చాలక జీవితాలే బలి అయిపోవటమూ జరుగుతుంది.

ఘోషించే సముద్రం లాంటి మనసులో కల్లోల తరంగాలు ఉవ్వెత్తున లేచి పడుతున్నాయి. ఈ ఘోష మనసుని దహిస్తూంటే శూన్యం నిండుకుంటున్న హృదయాన్ని పదిల పరుచుకోవటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తూ గది అంతా కలయ తిరుగుతోంది శారద.

అప్పటికే ఆమె తన పెట్టెను సుమారుగా సర్దేసింది. టేబిల్ సొరుగులూ, అలమార్లూ, బీరువా...అన్నీ తెరిచి పెట్టింది. మళ్ళీ మళ్ళీ వాటిలో వెదుకుతోంది. చూసినవే చూస్తోంది. తీసినవే తీస్తూంది. ఉండి ఉండి గుర్తుకు తెచ్చుకుని మరీ వెదుకుతోంది. తన బట్టలు... బొమ్మలు... అల్లికలు... ఫోటోలు...తనదన్న వస్తువేదీ ఉండకూడదన్నట్టు సర్దుతోంది. అంతరాంతరాల్లో రగులుకుంటూన్న ఆక్రోశం...

"శారదా...!"

చివాలున లేచి నుంచుంది. కాని, వెనక్కి తిరిగి చూడలేదు.

"వెళ్ళిపోవటానికే నిశ్చయించుకున్నావా" అంటూ సత్యం రెండడుగులు ముందుకు వేశాడు.

చప్పున పక్కకు తప్పుకుంది శారద. వెనక్కి తిరిగి ఆ కళ్ళలోకి చూడాలని లేదు. అతని మాటలు వినాలనీ లేదు. తనకు సన్నిహితంగా వచ్చిన అతని ఊపిరి తనకు తగలటం కూడా తనిక భరించలేదు.

"మాట్లాడవేం?" అసహనంగా అన్నాడు.

"ఒక్క దెబ్బతో గుండెను ముక్కలుగా చీల్చేశాక ఇంకా మాటలు వస్తాయా?... రక్తం ఓడుతుందే తప్ప ఆ పగిలిన గుండె పలకలేదు, సత్యంగారూ."

ఆ సంబోధనతో ఉలికిపడ్డాడు సత్యం. దాంతోనే అర్థమయిపోతోంది అతనికి. 'ఈ బంధం ఇక తెగుతోంది. తను బిగించలేడు. అయినా పోగొట్టుకోలేడు.'

"నేను చేసింది పెద్ద నేరమంటావ్?"

"అని నేనెలా అనగలను? నేనే కాదు, ఏ కొద్దిమంది మాత్రమో తప్ప చాలామంది అనలేరు. గొంతు పిసికి చంపితేనే నేరం, గుండె పిసికితే కాదు అనుకుంటే మీదీ నేరం కాదు."

పొంగుతున్న ఆవేశాన్ని, పొర్లే దుఃఖాన్ని లోలోపలే అదిమి పెట్టడానికి విశ్వ ప్రయత్నం చేస్తూ తిరిగి చూసింది సూటిగా... లోతుగా. దెబ్బ తిన్న పులి తిరుగుబాటు, గాయపడ్డ పావురం దైన్యం- రెండూ ద్యోతక మవుతున్నాయి ఆమె ముఖంలోనూ, కళ్ళలోనూ.

"అనుకోని పరిస్థితులు అలా వచ్చి ఉంటాయని..."

"ఎందు కనుకోవు అంటారు. అంతేగా! వచ్చి ఉండచ్చు. కాని, మీ ప్రమేయమేం లేకుండానే అంత ముందుకు వచ్చి ఉంటాయా? పెళ్ళి క్షణాలమీద ఉన్న పాటున కుదిరిపోయి ఉండదుగా. అంతకన్నా ఎంతో ముందుగా మీ మధ్య పరిచయం పెరిగి ... స్నేహం... పెనవేసుకున్న ఆత్మీయత-ఇవన్నిటి తరవాతే పెళ్ళి దాకా వచ్చింది. ఆ అమ్మాయి ఓ స్కూలు టీచరు. పెళ్ళి వయసు మీరిపోయిన ఆడపిల్ల. కలల బరువుతో కుంగిపోతున్న కన్నెపిల్ల. చూసి చేసేవాళ్ళు లేకనో, ఆర్థిక పరిస్థితులు పెళ్ళికి అనుకూలించక పోవటానో ముందు వెనుకలు చూడకుండా తొందరపడి ఉంటుంది. కాని, మీరు సభ్య సమాజంలో పెద్దమనిషిగా మెలగుతూ, బాధ్యత కలిగిన ఒక పెద్ద ఆఫీసర్. అంతేకాదు. మీతో పదిహేనేళ్ళుగా కాపురం చేస్తున్న భార్య ఉంది మీకు. హైస్కూలు చదువుతున్న పిల్ల లున్నారు. మీ పరిచయం నుంచి పెళ్ళికి దారి తీసిన ఈ మధ్య కాలంలో మీకు ఇవి గుర్తుండి ఉండవంటే నేను నమ్మను. కోరి తెచ్చుకుంటే తప్ప ఇలాంటి ఇరుకు పరిస్థితులు రావు. అలాంటప్పుడు సంజాయిషీలూ, సంప్రతింపులూ ఎందుకు? అయినా, నాకెందుకు సంజాయిషీ ఇవ్వటం?"

"తను మనతో కలిసి ఉండటానికి ఒప్పుకుంది." మెల్లిగా గొణిగాడు.

"నాకు మాత్రం అంత సహనం లేదని చెప్పటానికి విచారిస్తున్నాను, సత్యంగారూ..."

వ్యంగ్యం సూటిగా తగిలింది. "పొరబాటు జరిగిందని..." సత్యం వాక్యం ముగించనే లేదు.

"సరి పెట్టుకోవచ్చుగా అనబోతున్నారు కదూ. నిజమే. కాని, కొన్ని పొరబాట్లు మాత్రం ఆ హద్దులు దాటిపోయి ఉంటాయి. అవి సవరించటానికి వీలు పడవు. అల్లా వీలుపడని పొరపాట్లకు క్షమార్పణలుకూడా ఉండవు. వాటి ఫలితాలు అల్లా అనుభవించవలసిందే. అద్దాన్ని ఈ చేతుల్లోంచి జార్చేస్తే కొత్తది తెచ్చుకుని ముఖం చూసుకోగలరు. కాని, ముక్కలయిన అద్దాన్ని సవరించి మునుపట్లా చేయగలరా? అతికించినా దానితో పాటూ మన ముఖమూ వికృతంగానే కనబడుతుంది. ఇంతెందుకు? నాకు మీ సమాధానమూ, సమర్థింపూ అవసరం లేదు. రాజీపడి బతకలేని అశక్తురాలిని."

శారద మొండి వైఖరి సత్యంలో అసహనం కలిగిస్తోంది. అయినా, తను తప్పు చేశాడు. సానుకూలం చేసుకోక తప్పదు. అనునయంగా అన్నాడు:

"నీ మాట నీది కాని, శారదా, ఇప్పుడు నీ కేం తక్కువయింది? నిన్ను చిన్నచూపు చూస్తానేమో అని కానీ, నీ కే సుఖం ఇవ్వలేనని కానీ, నీ కేదో లోటు చేస్తాననికానీ అనుకోకు. నీ కా భయమే అక్కర లేదు."

తాచులా చివ్వున తలెత్తి చూసింది. కత్తిలాంటి చూపు అది. అదయినా క్షణమాత్రమే. మరుక్షణంలో అతి ప్రయత్నం మీద చిన్న చిరునవ్వును పెదాలకు పులుముకొని, ఓరగా చూస్తూ-"చూడండి! మిమ్మల్ని చిన్న చూపు చూడను. మీకు కావలసిన సుఖం అందిస్తాను. సకల సౌకర్యాలు సమకూరుస్తాను. మీ కేం తక్కువ చేయను. ఏ లోటూ కలగనీయను. మరో మగవాడితో సంపర్కం పెట్టుకుంటాను. మీరు భరించి సర్దుకు పోగలరుగా!" అంది.

"నోర్ముయ్!" ఉడికిపోతూ చేయి పైకెత్తాడు సత్యం.

నింపాదిగా అతని ముఖంలోకి, ఆ ఎత్తిన చేతికేసి చూసింది శారద. "ఇదే మాట నేననలేక పోయాను ఇందాక మీ రలా అడిగినప్పుడు."

"నువ్వూ, నేనూ ఒకటే నంటావా?" ఉక్రోషంతో వణకిపోతున్నాడు సత్యం.

"ను...వ్వూ...నే...నూ...అంటే మగవాడూ, ఆడదీ ఒకటేనా అని కదూ మీ భావం. మనసు, ఆశలు, అనుభూతులు, కోరికలు, అనుభవాలు ఇద్దరికీ ఒకటే. శీలం విషయాని కొస్తేకూడా ఇద్దరూ సమానమే నా దృష్టిలో. శీలం అన్నది ఆడదానికే పరిమితమయింది కాదు. అది మగవాడికీ ఉండాలి. కనీసం తన భార్య 'సీత' లా ఉండాలని భావించే మగవాడయినా తను 'రాముడి'లా ఉండగలగాలి. పెళ్ళి చేసుకుని మరో ఆడదాన్ని తెచ్చుకున్న మీకు నేను మరో మగవాడితో..."

"మళ్ళీ ఆ మాట అన్నావో..." సహనం కోల్పోయి పిడికిలి బిగించాడు సత్యం.

"అరె! మాట మాత్రంగా కూడా సహించలేక పిడికిళ్ళు బిగిస్తున్నారు చూశారా... హుఁ."

"ఊఁ...అయితే ఏం చేయాలనుకుంటున్నావు?" ఉరుముతున్నట్టు అన్నాడు.

"ఒక మగాడికి ఒకే పెళ్ళాం అన్నది నా సిద్ధాంతం. నే నేం చేయాలనుకుంటున్నానో మీకు అర్థం కావటం లేదనుకోను."

"పిల్ల లున్నారని మరచిపోతున్నావు." నిష్ఠురంగా అన్నాడు సత్యం.



వింతగా చూసింది శారద. కళ్ళు, ముఖం నిండా ఆశ్చర్యం పులుముకుంది. "నిజం? కాని, మీరు పిల్లలూ, పెళ్ళాంకూడా ఉందని మర్చిపోయారు, సార్!"

నిటారుగా అయ్యాడు సత్యం. ఆగ్రహం, ఆవేశం ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి అతడిని. శారద మాటలు నసాళాన్ని అంటుతున్నాయి. పురుషత్వం ఈ ప్రతిఘటనని జీర్ణించుకోలేకపోతోంది. భరించలేకపోతోంది. సంబాళించుకుంటూ నిగ్రహాన్ని ప్రదర్శిస్తున్నాడు. "అయితే, వెళ్ళిపోవాలనే నిశ్చయం చేసుకున్నావన్న మాట. సరే. పిల్లలను వదిలి ఉండగలవనే అనుకుంటున్నావా?" బెదరింపు ఉంది ఇందులో. ఇదే సత్యానికి చివరి ఆయుధం కూడా.

శారదకు అర్థమైంది-మాతృత్వమనే సున్నితమైన వలని కప్పాలని, పైకి కనిపించని ఆ బంధాలతో తనను కట్టి పడేయాలని చూస్తున్నాడని. కళ్ళు చెమర్చాయి. "ఏమన్నారు?" రాలడానికి ముందుకు దూకిన బిందువులని కనురెప్పల మాటునే బిగించింది.

"పిల్లలని వదలి ఉండగలవనే అనుకుంటున్నావా... అని..."

తనని వదలలేని బేలతనం, తనని ఆపలేని నిస్సహాయతకూడా అతనిలో తొంగిచూడటం గుర్తించింది శారద. మనసు ఆర్ద్రమైంది-ఒక్క క్షణం సేపే! వెన్నుపోటు పొడిచిన అతడి చర్య..."

"నన్ను వదలి క్షణమైనా మీ రుండలేరనికూడా అనుకుంటూ వచ్చాను ఇన్నాళ్ళూ. మీకు దూరంగా మిమ్మల్ని వదలి ఇలా వెళ్ళాల్సివస్తుందని అనుకోలేదు కూడా. కాని, మనం అనుకున్నవన్నీ జరగవని, అనుకోనంత మాత్రాన ఆగిపోవనీ నేర్పుతోంది నా అనుభవం।"

"నీ నిర్ణయం మారదంటావు?" కరుకుగా అడిగాడు సత్యం.

"మీ ప్రశ్నలోనే నా జవాబూ ఉంది. ఒక ఆలోచన స్థిరపడ్డాకనే అది నిర్ణయం అవుతుంది." దృఢ చిత్తంతో అంది శారద.

"ఎంత తేలికగా తొలగ ద్రోసుకుని పోగలుగుతున్నావు?" నింద.

"నా జీవితానికి సరిపడా బరువు మోసుకుని వెళ్తున్నాను నా గుండెలో..." నిష్ఠురం.

"అవమాన పడతావు." హెచ్చరిక-సవాలు ధ్వనించింది.

"నేను కాదు. అయినా, ఆత్మాభిమానం చంపుకుని పడి ఉండడం కన్నా మించిన అవమానం ఉంటుందనుకోను." ఆత్మస్థైర్యం ప్రతి ధ్వని.

××× ××× ××

"తొందర పడ్డావేమో, శారదా, నీవు!"

సోఫా పక్కనే తల వంచుకుని నేలమీద కూర్చుని ఉన్న శారద చివాలున తల ఎత్తి చూసింది. దెబ్బ తిన్న కుక్కపిల్ల చూపులా దీనంగా...ఆమె హృదయం బాధగా మూలిగింది.

తన ఇంటినుండి నేరుగా ఇక్కడికే వచ్చేసింది. డాక్టరు గారితో కుటుంబ పరిచయం శారద చిన్నతనం నుండీ ఉంది. శారద తండ్రితో గాఢ స్నేహం. శారద అంటే అభిమానం జాస్తి ఆయనకి.

వసిపిల్లవాడిలా తనతో కలిసిపోయి ఆడుకునే 'డాక్టరు బాబాయ్' అంటే శారదకు ఇష్టం, చనువు, గౌరవంకూడా.

శారదకు మంచి సంబంధం చూడాలని ఆయనే వెదికి వెదికి ఈ సంబంధం తీసుకొచ్చారు.

తను శ్రమించి, ప్రయత్నించి కట్టిన పందిరికి ఆ లత అల్లుకుని మూడు పూలు, ఆరు కాయలుగా కళ కళ లాడుతూంటే పొంగిపోయాడు.

కాని, ఇంతలో ఇదేమిటి? ఇలా తెంచుకుని...

భారంగా నిట్టూర్చాడు. కళ్ళజోడు తుడుచుకుని అమర్చుకుంటూ శారద తలమీద చేయి వేసి ఆప్యాయంగా నిమిరాడు.

"అల్లా దీనంగా చూడకు, శారదా! నిన్ను బాధ పెట్టడం నా ఉద్దేశం కాదు. తొందర పడ్డావేమో నంటున్నానంటే...నీకు ఇద్దరు పిల్లలున్నారనే విషయం నీవు విస్మరిస్తున్నావేమో అని."

"పిల్ల లున్నారు, పిల్ల లున్నారు అంటారే కానీ, ఆ పిల్లలు ఆయనకి పిల్లలు కారా, బాబాయ్! ఆ సంగతి ఆయన గుర్తుంచుకొని ఉంటే...మాతృత్వాన్ని గుర్తు చేస్తున్నారే గాని, నా... నా... గురించి ఎవరయినా ఆలోచిస్తున్నారా? ఆయన చర్య నా స్త్రీత్వాన్ని ఎంత కించపరిచేదిగా ఉందో, నే నెంత అవమానం దిగమింగుకుంటున్నానో మీరు... మీరు అర్థం చేసుకోలేరు. నాలో ఏ లోపం చూసి ఆయన... ఇప్పుడు...ఉఁహుఁ... నే నంగీకరించలేను-ఈ మార్పును నే నంగీకరించలేను, బాబాయ్!"

బాధాపూరితమైన కంఠంలోంచి వెలువడిన ఆ నాలుగు మాటలు ముగింపుకు వచ్చేసరికి ఏడుపుగా మారి ఉద్ధృతంగా సాగింది.

మోకాళ్ళ చుట్టూ చేతులు బిగించుకుని మోకాళ్ళ మీదకు తల వాల్చేసి నిస్సహాయంగా విలపిస్తున్న శారదను ఆర్తిగా చూశాడాయన.

"జరిగేవన్నీ నీ అంగీకారానంగీకారాలకు కట్టుబడి జరగవు, శారదా! ఆగిపోవుకూడా..."

ముఖం పైకెత్తి విహ్వలంగా చూసింది. "అంటే... అంటే... మీరు ఆయన చర్యను సమర్థిస్తున్నారా? నాదే తప్పంటున్నారా?" రోషంతో, బాధతో పెదిమలను పళ్ళతో నొక్కి పెడుతూ ఆవేశాన్ని అదుపులో పెట్టుకోవడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్న శారదను జాలిగా చూశాడాయన.

పసితనంలో 'ఆటలో అరటిపండు' చేసి అన్నయ్యలు ఏడిపించారని ఉక్రోషంతో ఏడుపు, కోపం దిగమింగుకుంటూ తనతో నేరారోపణ చేసిన శారద బేల ముఖం జ్ఞాపకం వచ్చిందాయనకు. ఆ కంటి నీళ్ళు వ్రేలి కొనలతో తుడుస్తూ- "అతడిని సమర్థించడమూ కాదు, నిన్ను నిందించడమూ కాదు, శారదా, ఇది. రాజీ-అంతే. సహజీవనంలో ఇది చాలా ముఖ్యం. జీవితనౌక పరిస్థితుల గాలివాటు ననుసరించుకుని సాగిపోవలసిందే తప్ప, ఎదురు మళ్ళితే తెరచాప చిరిగిపోవచ్చు. నౌక తిరగబడవచ్చు. ఏ బండరాళ్ళకో కొట్టుకుని ముక్కలయి పోవచ్చు. మునిగిపోవచ్చు. అర్థం చేసుకో, శారదా!"

ఈ మాట పిచ్చివాడిని చూసినట్లు చూసింది శారద ఆయన్ని. చిన్న నవ్వు నవ్వింది, నిర్లక్ష్యంగా. "హుఁ! మీరూ మ...గ...వా...ళ్ళే కదా!" ఈసడింపుగా అంది.

"ఆవేశాన్ని అదుపులో పెట్టుకోగలిగితే తప్ప నా మాటలు నీకు బోధపడవు. నేను ఒక మగవాడిగా అతడిని సమర్థిస్తూ, నిన్ను సర్దుకోమనటం లేదు, శారదా! అనుభవాలతో తల పండిన పెద్దమనిషిగా.. నీ తండ్రి లాంటి వాడినిగా...ఒక్క మాటలో చెప్పాలంటే నీ శ్రేయోభిలాషిగా నీకు సలహా చెప్పాను. ఆడపిల్ల భర్త దగ్గర నిరాదరణ జరిగితే పుట్టింటి వారితో మొర పెట్టుకుంటుంది. అల్లాకాక నీవు నేరుగా ఈ డాక్టరు బాబాయ్ దగ్గిరికి వచ్చావంటే నా మీద ఎంతో నమ్మకంతోనూ, నేను నీవు కోరుకునే సహాయం అందించగలననే చిత్తంతోనూ ఈ ఇంటికి వచ్చి ఉంటావు. ఆల్‌రైట్! నీ కేం సహాయం కావాలో అడుగు." దృఢంగా అన్నాడాయన.

సాలోచనగా చూసింది శారద ఆయన ముఖంలోకి. పెదవులు కదిలాయి ఏదో చెప్పాలని మాట రాలేదు-ఎలా చెప్పాలో తెలీక.

"అడుగు, శారదా!" అభయం ఇస్తున్నట్టు భుజంమీద తట్టాడు.

"మీ ఇంట్లో ఆడవాళ్ళ అనారోగ్యం దృష్ట్యా ఒక వంటమనిషిని, ఆయా లాంటి ఒక మంచి పనిమనిషిని చూడమని చాలా సార్లు చెప్పారు మీరు నాతో. దయ ఉంచి ఆ అవకాశం మీ ఈ శారదకు ఇస్తే..."

"శా...ర...దా...!" అరిచినట్లే అని బాధగా చూశాడాయన.

"అవును. నాకు చదువు లేదు. ఇంకే పనీ చేతకాదు. ఆత్మాభిమానం పేరిట నేను ఇలా వచ్చేస్తే పుట్టింట్లో అన్నా వదినెల మధ్య దాన్ని కాపాడుకోగలనని నాకు నమ్మకం లేదు. నేను పోలేనుకూడా. మీరు దయతలిస్తే నేను ఇక్కడే... ఇక్కడే ఉంటాను-అప్పుడప్పుడయినా నా పిల్లల్ని చూసుకోడానికి." ఇక మాట్లాడలేక చీర కొంగు నోట్లో కుక్కుకుంది శారద.

×× ×× ××

"నమస్కారం" అన్నాడు సత్యం కుర్చీలోంచి లేచి నిలబడి.

"నువ్వా...!" అతడిని కూర్చోమన్నట్టుగా సైగ చేస్తూ పక్కనున్న సోఫాలో తాపీగా ఆసీనులయి 'ఏమిటి' అన్నట్టు చూశాడాయన.

"మీతో మాట్లాడాలని..." మెల్లగా అన్నాడు సత్యం డాక్టరుగారిని చూస్తూ.

"ఊఁ... ఏమిటి?"

తల వంచుకున్నాడు సత్యం.

"అదే... శారద గురించి..." మాటలు దొర్లటం కష్టంగా ఉంది. ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో తోచలేదు. తలెత్తి ఓరగా ఆయన కేసి చూశాడు.

డాక్టరుగారు కళ్ళజోడు తీసి చూసుకుంటూ శ్రద్ధగా దాన్ని తుడుచుకుంటున్నారు. ధైర్యం తెచ్చుకున్నాడు సత్యం.

"జరిగింది జరిగిపోయింది. తనిలా రావటం బాగా లేదు. మీ రెలాగైనా శారదకు నచ్చ చెప్పి రాజీ పరుస్తారని..."

"ఏ శారద?" కళ్ళు పైకెత్తి అన్నా రాయన.

ఒక్క క్షణం అయోమయంగా చూశాడు సత్యం. మరుక్షణం అతడికి అర్థమై పోయింది, ఆయన ఉద్దేశ పూర్వకంగానే అడుగుతున్నారని.

"నా భార్య శారద. అదే...ఇప్పుడు మీ ఇంట్లో ఉంటున్న మీ శారద..." ఆవేశాన్ని అదుపులో ఉంచుకుంటూ అన్నాడు.

"నీ శారదో, మాశారదో కానీ, ప్రస్తుతం మాఇంట్లో ఉన్న శారద మా వంట మనిషి-మా అందరికీ ఆయా. ఇంకా..."

"డాక్టరుగారూ..."

"ఉండు. నన్ను చెప్పనీ. ఇందాక సర్ది చెప్పటం, రాజీ పరచటం అని ఏదో అన్నావు చూడు. అది ఈ శారదకే అయితే, నే నేం చేయలేను. అవన్నీ చేయడానికి తను ఈ ఇంటి ఆడపడుచు కాదు. జీతం తీసుకుని పనిచేసే ఈ ఇంటి పని మనిషి మాత్రమే-కనుక..." నింపాదిగా అంటున్నారు.

ఒళ్ళు మండిపోయింది సత్యానికి. అయినా, తేరుకున్నాడు క్షణంలో. "అలాగా, సార్! దయచేసి మీ వంటమనిషి అయిన నా భార్యతో నేను కాస్త మాట్లాడాలనుకుంటున్నాను. అనుమతి ఇవ్వగలరా?" వ్యంగ్యంగా అన్నాడు.

×× ×× ××

సత్యాన్ని చూసి ముఖం చిట్లించింది శారద.

ఈ నెల రోజుల్లోనూ బాగా చిక్కిపోయింది.

ఇన్నాళ్ళూ అనుభవించిన ఒక అందమైన ప్రపంచంలోంచి శూన్యంలోకి పయనిస్తే-



ఎన్నేళ్ళుగానో విహరిస్తున్న సుందర నందనోద్యానవనం హఠాత్తుగా కళ్ళ ముందు మరుభూమిగా మారిపోతే-

వ్యథాభరితమైన ఆ హృదయం ఆ వ్యక్తిమీద చూపించే ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో అందుకు ప్రతీకగా ఉంది శారద.

శారదను చూ°సి మనసులోనే మెచ్చుకున్నాడు సత్యం.

"నీతో మాట్లాడాలని వచ్చాను, శారదా!" మార్దవంగా అన్నాడు.

భుజం చుట్టూ కప్పుకున్న కొంగుని మరింతగా లాక్కుని, చివర్లు మెలి పెడుతూ తల వంచుకుని నిలబడి ఉంది శారద.

"నిన్నే... నీ తోనే మాట్లాడాలని వచ్చాను." రెట్టించాడు.

"మనిద్దరి మధ్యా ఇంకా మాట్లాడవల°సిన మాట లున్నాయా?" నిర్లిప్తంగా అంది.

"నా కున్నాయి."

"చెప్పండి." భావరహితంగా అంది.

"చూడు, శారదా! జీవితాలు సర్దుబాటు చేసుకునేందుకు చూడాలి గానీ, మరింతగా ఛిన్నాభిన్నం చేయబూనడం అవివేకం."

"వివేకం గురించి చెప్పటానికి వచ్చారా, సత్యంగారూ?" వ్యంగ్యం ధ్వనించింది.

ఆ బాణం గుచ్చుకుంది. సత్యం కనుబొమలు ముడిచాడు. అతడికి అసహనంగా ఉంది. మనసంతా గజిబిజిగా ఉంది. "పిల్లలు నిన్ను చూడాలంటున్నారు." పొడి పొడిగా అన్నాడు.

"మరి మీ రొచ్చారేం?"

"నిన్ను తీసుకు పోవాలని..."

"వస్తాననుకునే వచ్చారా?" తీక్షంగా, కఠినంగా ఉంది శారద స్వరం.

"తీసుకు పోవాలనే రావటం." అధికారికంగా అన్నాడు సత్యం.

"చూడండి! ఎవరినయినా ఒక కోరిక కోరటానికి కానీ, అధికారికంగా శా°సించడానికి కానీ తగిన ఆత్మీయత, అర్హత ఉండాలనుకుంటాను."

"అంటే, ఇప్పుడు లేదంటావా?" విసురుగా అడిగాడు.

ఒక్క క్షణం మిన్నకుంది శారద. ఎంత ప్రసన్నంగా ఉండాలని ప్రయత్నం చే°సినా, ఆమె మనసులో కుతకుత లాడుతున్న అగ్ని పర్వతం ఉంది. "సత్యంగారూ! మీరు గొప్ప విద్యాధికారి . ఒక పెద్ద ఆఫీసరు. నేనో... నాలుగక్షరం ముక్కలు నేర్చుకుంటే చాలు, మొగుడికి ఉత్తరం రాసుకునేందుకు అని ఇంట్లో పెద్దవాళ్ళు అంటే. కాబోలు అనుకుని ఆ నాలుగు ముక్కల్నే నేర్చుకున్నాను. ఒకనాడు నన్ను మీ చేతుల్లో పెట్టి 'ఇతడు నీ భర్త-నీ జీవిత సర్వస్వం, నీ తోడు, నీ నీడ... ఇతడిని ప్రేమించు, పూజించు, గౌరవించు' అని పెద్దలు చెబితే, ఆ పదాలకు అర్థం ఇదీ అనికూడా తెలియని వయసులో మీ వెంట వచ్చాను. నా సర్వస్వం మీరుగా భావించాను. మీతో కలి°సిపోయాను. మైనంముద్ద లాంటి మనసు చెప్పినట్లు నడుచుకుంది. పిల్లలు పుట్టారు. ప్రేమించాను. లాలించాను. ఆ తరవాతే ఈ మనసుకు ఆశలు, అనుభవాలు అనేవి అర్థమయాయి. పరిపూర్ణమైన జీవితాన్ని పొందాననుకున్నాను. కాని...కాని, ఈ మధురానుభూతులు మాత్రమే కాదని, నిర్మలమైన ప్రవాహపు అడుగున నుడిగుండాలలా అరకత్తెరలో నొక్కినట్లు అవమానాలుకూడా ఉంటాయనీ, వాటిని భరించటం కష్టమనీ తెలుసుకున్నాను-అదికూడా మీ దయ వల్లనే! నా జీవితంలో నిప్పులు పో°సి, నా గుండెలో మంటలు రగిల్చి, ఇంకా రమ్మని పిలవటానికి మీకు...మీకు..."

"శారదా!" కోపంగా వారించబోయాడు. "హుం... నేర్చుకుంది నాలుగక్షరం ముక్కలే అని చెప్పినా, మాటలు మాత్రం చాలా గొప్పగా ఉన్నాయి." ఎత్తిపొడుపుగా అన్నాడు.

"ఇవి జీవితం నేర్పిన పాఠాలు. అనుభవాలు నేర్పిన మాటలు. అంతేకాదు. ఇన్నాళ్ళూ ఒక గొప్ప విద్యాశాఖాధికారి భార్యను కదా. పూలతో కూడిన దారానికి సువాసన అబ్బటంలో విచిత్రం ఏముంది?"

"ఇన్ని మాట లెందుకు అనవసరంగా? వస్తావా, రావా?" విసురుగా అన్నాడు.

"నాకూ అనవసరమే. మీరు అడిగారు గనుక అనవసరమైనా చెప్పాను. ఎలాగూ చెబుతున్నాను గనుక, బాగా అర్థం కావాలని విడమరచి చెప్పాను. ఇక మీ ప్రశ్నకు రాను, రాలేను అన్నది నా జవాబు." నిబ్బరంగా అంది శారద.

ఆమె నిర్లక్ష్యానికి, మొండి వైఖరికి ఉడికిపోతున్నాడు సత్యం. "వంట లక్కగా బతకటం అవమానంగా లేదూ?" హేళనగా అన్నాడు.


# టాక్సు పుస్తకాలు

**సేల్సుటాక్సు:-** ఇందులో ఆంధ్ర & సెంట్రలు సేల్సుటాక్సు చట్టాలు, రూల్సు, చిన్నవ్యాపారులకు పన్నుపేదనేరూలు, తనిఖీలు, నేరాలు పినాల్టీలు, టాక్సు రేట్లు, అప్పీళ్ళు, ముఖ్యమైన సేల్సుటాక్సు విషయాలన్నీ ఉన్నాయి. ప్రతివ్యాపారి వారిరక్షణకు తెలుసుకోదగ్గవెన్నోఉన్నాయి. రూ.25.

**ఇన్ కంటాక్సు:-** రాబడిపన్ను, ఎస్టేటుడ్యూటీ, గిఫ్టు, వెల్తు, కేపిటలుగెయిన్సు, వ్యవసాయరాబడి. అన్నివివరాలతో వాటిటాక్సురేట్లు వివిధరకాలరాయితీలు. ఇన్ కంటాక్సు సర్వవిషయాలున్నాయి. మంచిరాబడున్నవారు, సంపన్నులు వారిభద్రతకు తెలుసుకోదగ్గవెన్నోఉన్నాయి. రూ.25.

**వ్యవహారదర్శిని:-** నిత్యజీవితంలో ఎదురయ్యే అనేక వ్యవహారాలసంబంధ, వివిధ-చట్టాలవివరాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు, దస్తావేజులు, ఎగ్రిమెంట్లు, వివిధపత్రాలు వ్రాసేవిధానాలు, వాటిఅనేక నమూనాలతో ఉన్నాయి. అందరికీ బాగా ఉపయోగించేది. రూ.15.

ఈపై మూడుపుస్తకాలను నేటివరకువచ్చిన అన్నిమార్పులతోను అడ్వకేటుమూర్తిగారు అందరికీ తెలిసేలా తెలుగులో వ్రాశారు. ఇవితెలుసుకొంటే మీటాక్సుసమస్యలను, వ్యవహార సమస్యలను నిశ్చింతగా మీరే స్వయంగా సమర్థించుకొనే సామర్థ్యం వస్తుంది.

ఈ 3 పుస్తకాలు రూ. 65 కే పంపబడును. వీటిలో ఏరెండు పుస్తకాలకయినా పోష్టుఖర్చులుచితం. విడిగాపోష్టుఖర్చు రూ.7అదనం. దేశసేవప్రచురణలు, ప్లాటు నెం.2. ఇందిరానగరు, వెంగళరావు నగరు ఓవరుహెడ్ వాటరు టాంకు సమీపాన హైదరాబాదు-500890 కి ఉత్తరంవ్రాస్తే పైవాటిలో మీకు అవుసరమైనపుస్తకాలు వి.పి.పోష్టుద్వారా మీకుపంపబడును.



అడ్మిషనులు ప్రారంభమయినవి
స్కూలు పునః ప్రారంభం
4 జూన్ 1985

స్థాపితము:1962 ఫోన్:22084



**శ్రీ విద్యా విహార్ & శ్రీ విద్యా విహార్ పబ్లిక్ స్కూల్**

"ఆదర్శ గురుకుల విద్యాసంస్థలు"

లలితానందనగర్, రింగురోడ్, గుంటూరు-522006

బ్రాంచి: దాసరివారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ-2

నర్సరీనుండి 10వ తరగతి వరకు ఇంగ్లీషు & తెలుగు మీడియంలలో తరగతులు. ఇంకనూ-సైనికస్కూలు, కోరుకొండ; పబ్లిక్ స్కూళ్ళ స్కాలర్‌షిప్స్ పరీక్షలు; డెహరాడూన్ మిలటరీస్కూలు; తాడికొండ, సర్వేపల్లి మొ॥ రాష్ట్ర రెసిడెన్షియల్ స్కూళ్ళ పరీక్షలు మొదలగు ప్రవేశపరీక్షలకు ప్రత్యేక శిక్షణ.

★ స్థానికులకు స్కూలు బస్ సౌకర్యము కలదు ★

APPLICATIONS ARE INVITED FOR TEACHER POSTS

PRAGATHI • dzvar...

"ఎవరికి?"

"నీకే!"

"లేదు. ఎందు కుండాలి? ఈ ఇంటికి నేను వంటలక్కగానే వచ్చాను. వంటలక్కగానే బతుకుతాను. ఇందులో న్యూనత ఏముంది?" మమతలు, అనురాగం తగలబడి పోయి భస్మరాశిలా ఉంది శారద హృదయం ఆ క్షణాన.

"ఇంతకన్న నాతో ఉండటం నీకు హీనంగా అనిపించిందా?"

"ముమ్మాటికీ. ఎందుకోకూడా చెప్పనా? ఆ ఇంటికి... అదే మీ ఇంటికి కోటి కలలతో, శతకోటి ఆశలతో కొత్త పెళ్ళికూతురిలా అడుగు పెట్టాను. ఇల్లాలిగా మారి మీకూ, మీ సర్వ సంపదలకూ, హక్కులకూ అర్ధాంగి నయ్యాను. మీ హృదయ సామ్రాజ్యానికి మహారాణిలా వచ్చి మీ ప్రేమ వాహినిలో పూల పడవలా సయ్యాట లాడాను. ఇప్పుడు... ఇప్పుడు... నా సర్వస్వం, నా సొంతం అనుకున్నది మరొకరు హక్కు భుక్తం చేసుకుంటే, నా స్థానాన్ని నిర్దాక్షిణ్యంగా మరొకరు ఆక్రమి స్తే జీవచ్ఛవంలా చూస్తూ, మాజీ భార్యగా బతుకు గడపటం కన్నా ఇదేం అవమానం కాదు. అవమాన పడటానికి ఇందులో ద్రోహం, వంచన, మోసం-ఇలాంటి వేం లేవు." తీక్షంగా, కఠినంగా అంది.

ఆమె హృదయానికి తగిలిన గాయం తాలూకు బాధ అతణ్ణీ స్పృశిస్తోంది.

"శారదా! నీ బాధ నేను అర్థం చేసుకుంటున్నాను. అయినా, చెబుతున్నానుగా- మాజీ భార్య వని నిన్ను నీవే కించపరుచుకోవటం, ఆ భయం, చిన్నతనం నీ కెందుకు? నీ కేం తక్కువ చేస్తానని సందేహిస్తున్నావు?" అనునయంగా అన్నాడు.

ఈ ప్రశ్న మళ్ళీ వచ్చింది. శారద గుండె మళ్ళీ రగిలింది. "ఈ ప్రశ్న మీ రిదివరకే అడిగారు. నేను సమాధానమూ చెప్పాను. ఇప్పుడు మళ్ళీ అడిగారు గనుక మరోసారి చెబుతాను. చెప్పటం కాదు. నేనూ అడుగుతాను. మీకు నేనూ ఏదీ తక్కువ చేయను..."

"శారదా!" వారించాలని చూశాడు. ఆమె అనబోయేది తెలిసిపోయిం దతనికి.

"ఎందులోనూ లోటు రానీయను..."

"శారదా... ఆపు." గర్జించాడు. శారద ఆపలేదు.

"ఆ ఇంట్లో... ఆ మంచాలమీద... ఆ మెత్తని పరుపు పైన, ఒత్తైన ఆ దిళ్ళమీద మరో మగవాడితో నేనూ అనుభవం పొందితే... ఆనందం పంచుకుంటే, మీరు ఒప్పుకోగలిగితే మీ కే బాధా ఉండదనీ, సర్దుకు పోగలననీ చెప్పగలిగితే..."

సత్యం నరనరాల్లో, పౌరుషపు జ్వాల చెలరేగి అతడి కళ్ళలో ఎర్ర జీరలు చోటు చేసుకున్నాయి. అసహ్యించుకుంటున్నట్లు చూశాడు. ఛీత్కారంగా అన్నాడు. "ఛీ. బుద్ధి గడ్డి తిని నీ కోసం వచ్చాను."

"ఇప్పుడు కొత్తగా తినలేదు."

"శారదా!" పురుషత్వపు అహంకారం బుసలు కొట్టి ఉద్రేకం, కోపంతో పొంగిపోతూ చేయి పైకెత్తాడు.

ఆ క్షణంలో శారద అతడి కేసి చూసిన చూపులో...ఆ వాడి... వేడి... లేకపోయినట్లయితే, శారద కళ్ళు పచ్చబడి ఉండేవి.

ఇంకొక్క క్షణంకూడా నిలబడకుండా ధైటు దిన్న త్రాచులా చరచర వెళ్ళిపోయా డక్కడి నుంచి.

మెరుపులు, ఉరుముల తరవాత ఆకాశం కుంభవృష్టి కురిపించినట్లు భోరున విలపించింది శారద.

ఎంతో సేపటికి కానీ తేరుకోలేకపోయింది.

తేరుకుని తలెత్తి చూ స్తే డాక్టరు బాబాయి ఎప్పుడనగా వచ్చారో కానీ, తననే గమనిస్తున్నారు.

ఇన్నాళ్ళూ బింకంగా తిరిగిన శారద ఆయన ముందు బయట పడిపోయింది.

"నే నంతా విన్నాను, శారదా! నా కొక్కటే సందేహం. నువ్వు ఎంతో అభిమానంతో, రోషంతో చెక్కు చెదరకుండా మాట్లాడావు. మరి ఇప్పుడేమో ఏడుస్తున్నావు. నీ బాధ అతను ద్రోహం చేసినందుకా? అతడిని వదిలేసి వచ్చినందుకా? అతడి సమక్షాన్ని భరించలేకనా? వియోగాన్ని సహించలేకనా? ఇవేవీ కాక నీ పిల్లలూ, సంసారం దూరమయిందనా? ఎన్నో కావాలనుకున్నప్పుడు కొన్ని వదులుకోవాలి. ప్రత్యేకించి కొన్నే కావాలనుకున్నప్పుడు ఎన్నిటినో పోగొట్టుకోవాలి. ఏదో ఒకందుకు సిద్ధ పడాలి. దేనికి సిద్ధపడి ఉండాలో నీవు బాగా ఆలోచించుకోవాలి."

"చెప్పటం తేలికే, బాబాయ్!" నిష్ఠురంగా అంది శారద.

"కొన్నిటిని కాలదన్నుకోవటంకూడా తేలికే, శారదా! సరేలే. ఇందాక సత్యంతో నీ ప్రస్తావన వచ్చినప్పుడు నీవు మా వంట మనిషి వని,



అయావని అన్నాను. అందుకు..."

"లేదు, లేదు. నేను అందుకు బాధ పడటం లేదు. మీ రే ఉద్దేశంతో ఆ మాటలు వదిలారో నేను అర్థం చేసుకోగలను, బాబాయ్."

తల వంకిస్తూ శారద వీపు తట్టి వెనుతిరిగారు ఆయన.

శారద నిశ్శబ్దంగా కూర్చుండి పోయింది చాలా సేపు.

** ** **

మిట్టమధ్యాహ్నం...

భోజనం అయిందనిపించి అప్పుడే పక్కమీద వాలింది శారద. కా సేపు కునుకు తీ స్తే మనసు కుదుట పడుతుందనిపిస్తోంది కాని, తొలిచేస్తున్న ఆలోచనలతో కళ్ళు మూ తలు పడటం లేదు.

"అమ్మా..అ...మ్మా!"

తనువూ, మనసూ ఝల్లుమన్నట్లయి త్రుళ్ళిపడి పక్కమీదినుంచి ఒక్క గెంతుతో గుమ్మం దాటింది. మరుభూమిలాంటి ఎడదమీద మాతృత్వపు జల్లు. అది అమృతపు జల్లే.

"బాచీ... చిన్నా..." ఆర్తిగా ఒక్క ఉదుటున ఇద్దరినీ చేతులతో చుట్టేసి గుండెకు అదుముకుంది. జల్లు కుంభవృష్టిగా మారి, కాలువలు కట్టి ప్రవహించి ఆ వసివాళ్ళ తలనీ, ముఖాన్నీ తడిపేస్తూంది...

"అమ్మా! మాతో చెప్పకుండా వచ్చేశావేం? ఇంకా నీకు ఒంట్లో బాగవలేదా?"

శారదకు అర్థమైంది పిల్లలకు తండ్రి ఏమని సమాధాన పరిచాడో! క్షణ మాత్రం కృతజ్ఞతాభావం మెదిలింది ఆమెలో.

తల్లినుంచి జవాబు రాకపోవడంతో-"అమ్మా! నీవు లేకుంటే మాకు ఏం బాగాలేదు. ఇంటికొస్తే నీవు కనబట్టం లేదు. మాకు ఏడుపు వస్తోంది. 'డాక్టరుగారు ఇప్పుడే పంపరా? వచ్చేయవూ అమ్మా?'" వెక్కుతూ తల్లి చీర మడతల్లో ముఖం రుద్దుకుంటూ అన్నాడు చిన్నా.

గుండెను పిసికినట్టయి, ఒక్కొక్క రక్తపు బొట్టే కారుతున్నట్టు విలవిల లాడింది శారద.

"చి...న్నా..." మరింతగా దగ్గరకు హత్తుకుంది వాడిని.

"అమ్మా! పోనీ మేమూ నీ తోనే వచ్చి ఉండిపోమా?" తల వంచుకుని మెల్లిగా అన్నాడు బాచీ.

మంకెనపువ్వులా ఎర్రబారిన కళ్ళలోకి ఉబుకుతున్న దుఃఖాన్ని గుక్కిళ్ళు మింగుతూ లోపలికి తోసేస్తున్న కొడుకు వేపు చూసింది.

పన్నెండేళ్ళ బాచీ తమ్ముడిలా ఏడవలేకపోతున్నాడు. అలా అని నిబ్బరంగా నిభాయించుకోగల వయసూ లేదు వాడికి.

కాని, బాచీకి కొద్దిగా జ్ఞానం తెలుస్తోంది. తండ్రి మరో ఆవిడని పెళ్ళి చేసుకుని తీసుకువచ్చాడు. అది ఘోరమైన తప్పిదం. దాన్ని అమ్మ క్షమించలేదు. బాగా కోపం తెచ్చుకుంది. అందుకనే నాన్నను వదిలేసి వచ్చింది. అంతవరకే తెలుసు వాడికి.

"చూడు, చిన్నా! నీ కెంత వయసు...తొమ్మిదేనా! అయిదేళ్ళు దాటాక పిల్లలు ఏడవకూడదు. అన్నయ్య చూడు. అట్లా ఉండాలి. నా ఒంట్లో బాగాలేదు కదా మరి. అందుకని ఈ డాక్టరు తాతయ్య ఇంటికి వచ్చేశాను. మీరు నాతో ఉండిపోవాలంటే ఎలా, నాన్నా? మీ రిద్దరూ పేద్ద ఆఫీసరుగారి అబ్బాయిలు. అదీ డి.ఇ.ఓ. గారి పిల్లలు. మరి ఎంత బాగా చదవాలి, ఎట్లా ఉండాలి? అమ్మకు చదువు రాదు కదా. పైగా ఒంట్లో బాగాలేదు. అందుకని మీరు అమ్మ దగ్గరుండిపోతే సరిగా చదవలేరు. వీరన్న ఉన్నాడు కదా. అన్నీ చూసుకుంటాడు మీకు. ఇంక మీ నాన్నగారు ఉండనే ఉన్నారు. మీరు శ్రద్ధగా చదువుకుని, బాగా వృద్ధిలోకి వచ్చి, ఇద్దరూ పేద్ద పే...ద్ద...ఆఫీసర్లు అంటే నాన్నకన్నా గొప్ప ఆఫీసర్లయి పోవాలి. మిమ్మల్ని చూసి మీ నాన్న బెదరిపోవాలి. అప్పుడు...అప్పుడు....మీ అమ్మ...ఈ అమ్మ..."

వెల్లువలా దూకిన దుఃఖాన్ని అదుపులో పెట్టలేకపోయింది శారద. చిన్నా బెదరి పోయాడు. మరింతగా ఏడుస్తూ తల్లిని వాటేసుకున్నాడు. శారద ఒడిని తడుపుతున్నాయి ఈ సారి బాచీ కన్నీళ్ళు కూడా. నిగ్రహించుకోలేకపోయాడు. అమ్మ తమ్ముడిని మభ్య పెడుతున్న సంగతి బాచీకి అర్థం అవుతూనే ఉంది. నిజమే మరి. మరో విధంగా చిన్నాకు అర్థం కాదు.

తనకు తెలుస్తున్నది మాత్రం-'అమ్మ ఇంక ఇంటికి రా'దని.

"బాబూ..."

వీరన్న పిలుపుకి తెప్పరిల్లుకున్నారు.

"అలాగే, అమ్మా! నేను, తమ్ముడు నాన్న దగ్గరే ఉండి బాగా చదువుకుంటాం. అయితే, అప్పుడప్పుడూ నిన్ను చూడడానికి రామా, అమ్మా!"

ఎర్రబడ్డ బాచీ కళ్ళలో నీళ్ళు చిప్పిల్లుతూనే ఉన్నాయి.

నోట మాట రాలేక తల ఊపింది శారద.

"అమ్మా! ఈ ఒక్క రోజుకైనా నేను నీతో ఉండిపోనా?" ప్రాధేయపడుతూ వెక్కిళ్ళ మధ్య అడిగాడు చిన్నా.

గుండె అవిసిపోయింది శారదకు. పిల్ల లిద్దరినీ తన గుండెలో దాచేసుకోవాలనిపించిం దా క్షణంలో. కాని, మరు క్షణం వివేకం మేల్కొంది. తన ఒడి వాళ్ళకు చల్లదనాన్ని ఇస్తుంది. సేద తీరుస్తుంది. అంతేకాని వాళ్ళని సరిగా ఎదగనివ్వదు. తండ్రి నీడ వాళ్ళ కెంతో విలువను తెచ్చి పెడుతుంది. ఆ పందిరి అండన ఈ మొక్కలు ఎగబాకిపోతాయి. ఎదిగిపోతాయి. ఇది వాస్తవం.

తల్లి ఆవేదన చూశాడు- తమ్ముడి ఆరాటమూ గ్రహించాడు బాచీ. నెమ్మదిగా తమ్ముడి చేయి పట్టుకుని పైకి లేపి- "చిన్నా! అమ్మకు ఒంట్లో చాలా బాగా లేదని చెప్పారుగా నాన్న. నీ విక్కడుండిపోతే మరి కోపగించుకుంటారు. ఇంకో మారు పంపరు కూడా. మనిద్దరం కలిసి మళ్ళీ వద్దాం-సరేనా?"

తను పెద్ద ఆరిందాలా బుజ్జగించాడు-కాని... తనకూ అమ్మతో ఉండాలనే ఉంది. అయినా, తమ్ముడి చేయి పట్టుకుని బయలుదేరాడు.

వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ అడుగులు వెయ్యలేక వేస్తూ, వీరన్న చెరో చెయ్యి పుచ్చుకుని వెళ్ళలేక వెళ్ళుతున్న పిల్లలని చూస్తూ నేలకు అంటుకు పోయిన దానిలా నిలబడి పోయింది శారద.

ఇంకా వెక్కుతూనే ఉన్న చిన్నా ముఖం, ఏడుపును లోలోపల మింగుతున్న బాచీ పెదవుల కంపనం ఆమెను చిత్రవధ చేస్తున్నాయి.

'ఆడదానికి మాతృత్వం ఒక వరమే-అన్నీ అనుకూలంగా ఉంటే. కాని, కొన్ని పరిస్థితులలో అది ఒక శాపంలా వేధిస్తుంది. ఆడదాని మనసును చిత్రవధ చేస్తుంది కూడా. తప్పదు. తను గుండె రాయి చేసుకోవాలి' అనుకుంది శారద.

(సశేషం)

